క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం స్వీకరిస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం నిత్యాన్నదానం, గోసంరక్షణ పథకానికి చెన్నైకు చెందిన శ్రీకైలాస ట్రస్ట్ అధినేత ఎస్.రాజకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి విరాళం అందజేశారు. నిత్యాన్నదాన పథకానికి రూ.68,880, గో సంరక్షణకు రూ.5000 ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులును కలసి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి,అమ్మవార్ల శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేద పండితులతో ఆశీర్వాదం ఇప్పించారు. పట్టణ ప్రముఖుడు శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ సంఘం సమావేశం

శ్రీకాళహస్తి: పట్టణంలో రోటరీ క్లబ్(శ్రీరామ్ నగర్ కాలనీ)లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బీసీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం గౌడ్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం హాజరుకానున్నారని పేర్కొన్నారు. బీసీ సామాజికవర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తగ్గని వరద నీటి ప్రవాహం



కోబాక పొలాల్లో చెరువు నీటి ప్రవాహం

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల పొలాల్లో నీటి ప్రవాహం ప్రవహిస్తూనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాన్ ప్రభావంతో ఏర్పేడు, కోబాక, పోతుమానిగుంట, పాతవీరాపురం తదితర చెరువులు నీటితో నిండుకున్నాయి. చెరువుల కట్టలు తెగిపోకుండా చివర భాగాన రైతులు గండ్లు కొట్టారు. గండ్ల ద్వారా పొలాలపై నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. వరినారుమడులు సిద్ధం చేసుకున్న రైతులు సకాలంలో నాట్లు వేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. సీఐ శ్రీహరి కథనం మేరకు..తిరుపతికి చెందిన మునిరాజా(36), శ్రావణ్(45) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద ముందువెళుతున్న లారీని అధిగమించబోయి అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. ఈఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

అన్నదాన నిర్వహణ భేష్



ఆలయ మర్యాదలు చేస్తున్న ఈఓ, చైర్మన్

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి ప్రముఖ శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో నిత్యఅన్నదాన పథకం నిర్వహణ చాలా బాగుందని దేవదాయశాఖ తిరుపతి జాయింట్ కమిషనర్ వీఎస్ఎస్మూర్తి తెలిపారు. శనివారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఆలయ చైర్మెన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, ఈఓ కె.రామచంద్రారెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించగా, మెమెంటోను ఈఓ, చైర్మన్ అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఆలయ లోపల హుండీ నిర్వహణ, దక్షిణ ద్వారం, ఆలయ అభివృద్ధికి పలు సూచనలు ఇచ్చారు.

వేడుకగా పల్లకీ సేవ

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం పల్లకీసేవ వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, విశేషాలంకరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. చెన్నైకి చెందిన పీ రామచంద్రారెడ్డి, కవిత ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి పల్లకీసేవ నిర్వహించారు.

కండలేరులో 13.102 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 13.102 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి జలాశయానికి 150 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. హెడ్రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్కు 5, లోలెవల్ స్లూయీస్కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెరువులకు జల సవ్వడి



నిండుగా పల్లమాల చెరువు



కలుజు పారుతున్న కనమనంబేడు చెరువు



కలుజు పారుతున్న చిన్నపాలేడు చెరువు

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాన్ వర్షాలకు మండలంలోని 32 చెరువులు నిండాయి. పల్లమాల, కనమనంబేడు, గాజులపెళ్లూరు, చిన్నపాలేడు, చెరువులు నిండి ఐదు రోజులుగా కలుజులు పారుతున్నాయి. కలుజులు పారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు సాగునీటి ఢోకా లేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాళంగి నది కూడా ఉధృతంగా ప్రవహిస్తుంది.

ట్రాన్స్కో భారీ నష్టం

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో మిచాంగ్ తుపాన్తో ట్రాన్స్కోకు భారీ నష్టం వాటిల్లిందని ట్రాన్స్కో ఏఈ పుణ్యకోటి తెలిపారు. భారీ గాలులకు 20 ట్రాన్స్ఫార్మర్లు, 200 స్తంభాలకు పైగా నేల కూలడంతో రూ.30 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో విద్యుత్కు అంతరాయం ఏర్పడిందన్నారు. అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు యుద్ధ ప్రతిపాదికన పనులు చేస్తూ, విద్యుత్ను పునరుద్ధరిస్తున్నట్లు ఏఈ పుణ్యకోటి తెలిపారు.

పంట నష్టంపై నివేదిక సిద్ధం

వరదయ్యపాళెం: తుపాన్ కారణంగా జరిగిన పంట నష్టాల నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు ఏఓ సుహర్లత తెలిపారు. కాంబాకం, రామిరెడ్డిపాళెం, పెద్ద పాండూరు, చెన్నవారిపాళెం, నెల్లటూరు, వరదయ్యపాళెం, గూడలవారిపాళెం ప్రాంతాల్లో పంట నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. నీట మునిగిన వరి పంటకు సంబంధించి 312 హెక్టార్లు, ఇసుక మేటలకు సంబంధించి 40 హెక్టార్లు పంట నష్టం వాటిల్లినట్లు నివేదించినట్లు తెలిపారు.



గాజులపెళ్లూరు చెరువు వద్ద గ్రామీణుల కోలాహలం



ఉధృతంగా ప్రవహిస్తున్న కాళంగి నది

తుపాను బాధితులకు చీరలు, దుప్పట్ల వితరణ



పిచ్చాటూరు: సహాయకాల పంపిణీ

పిచ్చాటూరు: మండలంలోని నల్లపనాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీలో తుపాన్కు తీవ్రంగా నష్టపోయిన బాధితులకు లెక్చరర్ సుగిత చీరలు, దుప్పట్లు, 10 కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేశారు. పుత్తూరు ప్రభుత్వ బాలికల కళాశాలలో ఆమె లెక్చరర్గా, ఆమె భర్త వెంకటముని పిచ్చాటూరు పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్గా పని చేస్తున్నారు. తుపాన్ బాధితులు 16 కుటుంబాలకు వీటిని అందజేశారు. వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు అయ్యప్ప పాల్గొన్నారు.



తొట్టంబేడు : గిరిజనులకు బియ్యం పంపిణీ

సీపీఐ ఆధ్వర్యంలో..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని నారాయణపురం పంచాయతీ పరిధిలోని ముళ్లపూడి ఎస్టీ కాలనీ గిరిజన కుటుంబాలకు సీపీఐ ఆధ్వర్యంలో శనివారం బియ్యం పంపిణీ చేశారు. వర్షాల కారణంగా గిరిజనులు పనులు లేక భోజనానికి కూడా అవస్థలు పడుతున్నారు. వారి పరిస్థితిని గుర్తించిన సీపీఐ నాయకులు వారికి బియ్యం అందజేశారు. నాయకులు గురవయ్య, గోపి, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో శనివారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 70 మంది గర్భిణులకు వైద్యాధికారి దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. పలు సలహాలు ఇచ్చారు. సీహెచ్ఓ వెంకటేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఎంట్రీలను తొలగించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయుడు దయాకర్

వరదయ్యపాళెం: ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలను తొలగించాలని వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్రెడ్డి శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ వేణుగోపాల్కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలు బూత్లకు సంబంధించిన ఓటరు జాబితాలో అత్యధికంగా డబుల్ ఎంట్రీలు ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తొలగించాలని కోరారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి ఉన్నారు.

పల్లెల్లో వికసిత్ సంకల్ప యాత్ర

సత్యవేడు: మండలంలోని పుదుకుప్పం, ఆంబాకం పంచాయతీల్లో శనివారం భారత్ వికసిత్ సంకల్ప యాత్ర సభలను నిర్వహించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రతాప్ మాట్లాడుతూ అర్హత ఉండి పథకాలు అందనివారు దరఖాస్తు చేసుకుంటే మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మునిసుబ్రమణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వర్లు రెడ్డి, ఈఓపీఆర్డీముని రవికుమార్ పాల్గొన్నారు.



పథకాలు వివరిస్తున్న మునికృష్ణయ్య

ఘనంగా అయ్యప్ప పడిపూజ

గూడూరురూరల్: పట్టణంలోని రాజావీధిలో ఉన్న వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం వద్ద అయ్యప్ప భక్త సమాజం, ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు పాల్గొని, భజనలు చేశారు. అన్నదానం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రసాదాలు స్వీకరించారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

సైదాపురం: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి 18 మెట్లకు పడి పూజలు చేశారు. మండలంలోని అన్నిగ్రామాల్లో అయ్యప్ప మాల ధరించిన భక్తులు పాల్గొన్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అయ్యప్ప నామస్మరణతో ఆలయం మార్మోగింది. అనంతరం ఇరుమడి కట్టి కొందరు స్వాములు శబరిమలకు పయనమైన్నారు.



పడిపూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

రాకపోకలకు 15 గ్రామాల ప్రజల ఇక్కట్లు



నాగలాపురం: మండలంలోని అరుణానదిపై ఉన్న ద్వారక నగర్ కాజ్వే తుపాన్ వరదనీటి ఉధృతికి కొట్టుకుపోవడంతో రాకపోకలను 15 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ కాజ్వే పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మండలాల మధ్య అనుసంధానంగా ఉంది. రోడ్డు కోసుకుపోవడంతో ఇటు నాగలాపురం అటు పిచ్చాటూరు మండలాల పరిధిలోని 15 గ్రామాల ప్రజలు రాకపోకలు నిలిచిపోయాయి. కిలో మీటర్ల దూరం చుట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం





కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయంలో నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శని వారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచు లక్ష్మీదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండలపంలో కొలువు దీర్చి విశేషాలంకరణ చేసి, వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యా ణం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అ మ్మవార్లను తిర్చుచిలో కొలువు తీర్చి సహస్రదీపాలంకరణ మండపానికి వేంచేపు చేసి, ఊంజల్ సేవ నిర్వహించారు.

లక్ష్మీనరసింహుడి సేవలో నెల్లూరు జిల్లా ఎస్పీ

పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామివారిని నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కుటుంబసభ్యులతో కలసి శనివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయాధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికి, మూడు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం నిత్యకల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలు, అందజేశారు. వేదపండితుల ఆశీర్వచనం పలికారు. ఆయన వెంట జిల్లా అడిషనల్ ఎస్పీ హిమవతి, డీఎస్పీ కోటారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఏడుకొండలు, ఈఓ జనార్ధన్ రెడ్డి, ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, వైఎస్సార్సీపీ నాయకుడు శివకుమార్రెడ్డి, తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో వలంటీర్ మృతి



రవికుమార్ (ఫైల్)

కేవీబీపురం: మండలంలోని సదాశివపురం గ్రామ వలంటీర్ బత్తల రవికుమార్(32) గుండెపోటుతో శనివారం మృతిచెందారు. తెల్లవారుజామున తీవ్రమైన గుండెపోటు రావడంతో ఇంట్లోనే కుప్పకూలాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు.ఆయనకు భార్యా,ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఎంపీడీఓ రామచంద్ర, సర్పంచ్ రామ్మోహన్వర్మ పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

లోక్ అదాలత్లో తీర్పు సుప్రీంతో సమానం



శ్రీకాళహస్తి: కేసులు పరిష్కరిస్తున్న జడ్జిలు



సత్యవేడు: కేసులు పరిష్కరిస్తున్న జడ్జి గోపాల కృష్ణ

శ్రీకాళహస్తి: లోక్ అదాలత్లో తీర్పు..సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ అన్నారు. సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొదట న్యాయమూర్తులు చేతుల మీదుగా మెడికల్ క్యాంప్ ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలతో ఇచ్చే తీర్పుకు అప్పీల్ ఉండదని, సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పెండింగ్లో ఉన్న అన్ని రకాల క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, లేబర్ కేసులు, సివిల్ కేసులు, కోర్టు వరకు వెళ్లని రాజీ పడదగిన తగాదాలు లోక్ అదాలత్ తో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అదాలత్లో 470 కేసులను పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, అన్ని శాఖల ఉన్నతాధికారులు, బ్యాంక్ సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సత్వర న్యాయమే లోక్ అదాలత్ లక్ష్యం

సత్యవేడు: ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమని సత్యవేడు కోర్టు ఇన్చార్జి జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాల కృష్ణ అన్నారు. శనివారం సత్యవేడు కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్లో 232 కేసులు పరిష్కరించి రూ.18,64,801 రికవరీ చేశారు. వాటిలో సివిల్10, క్రిమినల్ 48, బ్యాంకు కేసులు 13, సెకండ్ క్లాస్ కోర్టు పెట్టీకేసులు 161 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏపీపీ ప్రశాంతి, బార్ అసోషియేషన్ మెంబర్లు, స్టేట్బ్యాంకు, గ్రామీణ బ్యాంకు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసిటీ ఎండీ కుమార్తె పెళ్లి వేడుకలు



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధు

వరదయ్యపాళెం: శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కుమార్తె వివాహం, రిసెప్షన్ వేడుకలు వైభవంగా జరిగాయి. చెన్నైలో జరిగిన వివాహ వేడుకల్లో తమిళనాడు ముఖ్యమంత్రి సతీమణి దుర్గా స్టాలిన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమూరి ప్రభాకర్ రెడ్డి, బీద మస్తాన్రావు, టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి, మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కనుమూరి బాపిరాజు, సినీ దర్శకుడు రాఘవేంద్రరావు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి సూళ్లూరుపేటలో జరిగిన రిసెప్షన్ వేడుకల్లో మంత్రి కాకాని గోవర్ధన్రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, తిరుపతి జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం (సత్యవేడు), కిలివేటి సంజీవయ్య (సూళ్లూరుపేట), మధుసూదన్రెడ్డి (శ్రీకాళహస్తి), వరప్రసాదరావు (గూడూరు), మేకపాటి విక్రమ్ రెడ్డి (ఆత్మకూరు), కొరముట్ల శ్రీనివాసులు (కోడూరు), ఏపీ ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు హాజరై నూతన దంపతులు నిరీషా, సాగర్ పంకజ్లను ఆశీర్వదించారు.



వేడుకల్లో పాల్గొన్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

శ్రీవారి మెట్టు వద్ద ఘనంగా కార్తీక వనభోజనాలు





స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

చంద్రగిరి: పవిత్ర కార్తీకమాసం సందర్భంగా శనివారం శ్రీవారి మెట్టు వద్ద గల పార్వేట మండపంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకొచ్చారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని అర్చకులు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. అనంతరం పార్వేట మండపంలో మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు కార్తీక వనభోజనోత్సవం జరిగింది. కార్తీక వన భోజనం మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నారాయణాచార్యులు, ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ ప్రత్యేక అధికారి, టీటీడీ పీఆర్ఓ డాక్టర్ టి.రవి, వీజీవో బాలిరెడ్డి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చెంగల్రాయులు, వెంకట స్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్రెడ్డి పాల్గొన్నారు.

వర్షాలకు ఛిద్రమైన రోడ్లు





గోవర్ధనపురం వద్ద దెబ్బతిన్న కాజ్వే, కదూరు-సత్యవేడు మార్గంలో గుంతలు

వరదయ్యపాళెం: తుపాన్ వర్షాలతో మండలంలోని ఆర్ అండ్ బీ రోడ్లు ఛిద్రమయ్యాయి. తడ-వరదయ్యపాళెం, కదూరు-సత్యవేడు ప్రధాన రహదారులతో పాటు కారిపాకం గ్రామీణ రోడ్డు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పలుచోట్ల గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. ప్రధానంగా వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం వద్ద మారేదు కాలువపై నిర్మించిన లోలెవల్ కాజ్వే పూర్తిగా దెబ్బతినింది. శ్లాబు పూర్తిగా లేచిపోయే పరిస్థితుల్లో ఉంది. మళ్లీ వార్షాభావ పరిస్థితులు సంభవిస్తే కాజ్వే కొట్టుకుపోయే ప్రమాదం తలెత్తనుంది. ముందు జాగ్రత్తగా రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేస్తే పెను ప్రమాదం నుంచి విముక్తి లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు. రోడ్లన్నీ తక్షణమే మరమ్మతులు చేపడితే వాహన రాకపోకలు సజావుగా సాగుతాయని అంటున్నారు.

జనావాసాల్లోకి కొండచిలువ



కేవీబీపురం: జనావాసాల్లోకి కొండచిలువ వచ్చిన ఘటన శనివారం మండలంలోని మద్రిగుంట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న తామరగుంట ముళ్లపొదల నుంచి గ్రామానికి చెందిన బత్తెయ్య మేకల కొట్టాంలోకి చొరబడింది. పామును గమనించిన బత్తెయ్య దాన్ని దారిమళ్లించేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. విధిలేని పరిస్థితిలో గ్రామస్తులు కొండచిలువను చంపేశారు.